శ్రీశైలం ప్రాజెక్టుకు ప్రత్యేక స్థానం

- అధికారులు, సిబ్బంది అంకితభావంతో పని చేయడమే కారణం
- క్రస్ట్‌గేట్స్ రిటర్నింగ్ అండ్ లిఫ్టింగ్ ప్రాసెస్ కీలకం
- సీఈ కబీర్‌బాషా



డ్యాంసైట్ వద్ద కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఈ కబీర్‌బాషా

శ్రీశైలం నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక స్థానం ఉందని ఇరిగేషన్‌శాఖ చీఫ్ ఇంజనీర్(సీఈ) కబీర్‌బాషా అన్నారు. శనివారం డ్యాంసైట్ వద్ద అధికారులు సిబ్బందితో ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభకు ముఖ్యఅతిథిగా సీఈ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎగువ నుంచి విడుదలైన వరద ప్రవాహాన్ని పసిగడుతూ దిగువ ప్రాజెక్టుల పూర్తిస్థాయి నిల్వలను దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాజెక్టుల తీరాలలో ఉండే గ్రామాలు, పట్టణాలు, నగరాలకు ముంపు ప్రమాదాలు వాటిల్లకుండా అధికారులు సిబ్బంది సమన్వయంతో చేస్తున్నారన్నారు. ఇందులో క్రస్ట్‌గేట్ల రిటర్నింగ్ అండ్ లిఫ్టింగ్ ప్రాసెస్ అత్యంత కీలకమైనదని అన్నారు. అధికారులు, సిబ్బంది కుటుంబ, స్నేహపూర్వక వాతావరణం మధ్య విధులు నిర్వహించడంతో విజయాన్ని సాధించడం సాధ్యమైందని ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి అన్నారు. సిబ్బంది, అధికారులను ప్రశంసా పత్రాలు, నూతన వస్త్రాలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఈ వేణు గోపాల్‌రెడ్డి, డీఈలు తిప్పే స్వామి, గోపాల్‌నాయక్, చిట్టిబాబు, ఏఈలు మల్లికార్జున, సుదర్శన్, రెడ్డి, సామేల్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న సైబర్ నేరాలు

సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్



మాట్లాడుతున్న వేణు గోపాల్

ఆళ్లగడ్డ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ప్రపంచం మన జీవితాల్లో అంతర్భాగంగా మారడంతో సైబర్ నేరాల ముప్పు పెరిగిపోతోందని సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. శనివారం ఆళ్లగడ్డలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానాస్పద గేమ్స్, యాప్‌ల నుంచి దూరంగా ఉండడం సైబర్ బుల్లింగ్, గేమింగ్ వ్యసనం వంటి అంశాలపై అవగాహనతో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ అఫీసర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ శిక్షణ, డేటా బ్యాకప్ వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫిర్దోజ్ అన్జూమ్, అధ్యాపకులు, సిబ్బంది శ్యాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంలో మల్యాల పథకం

- ఎత్తిపోతల సామగ్రి చోరీ
- కంప చెట్లతో నిండిపోయిన పవర్ స్టేషన్
- ప్రశ్నార్థకంగా 9,800 ఎకరాల ఆయకట్టు



నాగటూరు వద్ద గల మల్యాల ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్

నందికొట్కూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నాగటూరు వద్ద గల మల్యాల ఎత్తిపోతల పథకం ఫేస్1, ఫేస్ 2 ఎత్తిపోతల పథకాలు అధికారుల నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఈ ఎత్తిపోతలకు విద్యుత్ సరఫరా చేసే పవర్ స్టేషన్‌లో కంప చెట్లు పెరిగాయి. అక్కడి ట్రాన్స్‌ఫార్మర్ల విడిభాగాలు, కాపర్ వైర్ మొదలైన రూ.లక్షల విలువ చేసే పరికరాలు ఎండకాలంలో చోరీకి గురయ్యాయని అధికారులు తెలిపారు. ఇక్కడ రూ.కోట్ల విలువ చేసే ఎత్తిపోతల పంప్‌హౌస్‌కు కొంత కాలం నుంచి వాచ్‌మెన్ కూడా లేడని అధికారులు అంటున్నారు. ఇదంతా ఎత్తిపోతల కమిటీ, రైతులే చూసుకోవాలని ఎత్తిపోతల పథకం టెక్నికల్ అధికారి, ఏఈలు సమాధానం ఇచ్చారు. నాగటూరు ఎత్తిపో తల పథకం 2012లో ప్రారంభమైన ఈ పథకం ఫేస్ 1 రూ.1536 లక్షల అంచనాతో నిర్మించారు. రెండు పంపుల ద్వారా 72 క్యూసెక్కుల నీటిని అందించేలా రూపకల్పన చేశారు. నాగటూరు గ్రామానికి 1000 ఎకరాలు, కొణిదేల 375, పగిడ్యాల 930, లక్ష్మాపురం2000, మండ్లెం 600 ఎకరాలతో కలిపి మొత్తం 4900 ఎకరాలకు నీరందేలా ఈ పథకాన్ని నిర్మించారు. అలాగే ఫేస్2 పథకం రూ 1600 లక్షల అంచనాతో నిర్మించారు. రెండు పంపుల ద్వారా 72 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేలా రూపకల్పన చేశారు. మండ్లెం 1000 ఎకరాలు, తర్తూర్ 375,



గుర్రపుడెక్క ఆకుతో మూసుకుపోయిన ఎత్తిపోతల ఎస్కేప్ ఛానల్



కంపచెట్లతో నిండిన ఎత్తిపోతల పవర్ స్టేషన్

నందికొట్కూరు 935, మల్యాల 2000 ఎకరాలు మొత్తం 4900 ఎకరాల ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో ఈ పథకాన్ని నిర్మించారు. కానీ నేటి వరకూ లక్ష్యానికి చేరుకోలేదు, అధికారుల గత వైసీపీ ప్రభుత్వ కాలంలో నిధులు మంజూరు చేయక నాయకులు, అధికారుల నిర్లక్ష్యంతో అరకొరగా పనిచేస్తున్న ఈపథకం పూర్తిగా మూలన పడిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎమ్మెల్యే జయసూర్య పట్టుదలతో కొంత నిధులను రాబట్టి మరమ్మతు చేయించి ఈ పథకాన్ని పని చేయించారు. కానీ ఇది ఎంతో కాలం నిలువలేదు. అధికారుల నిర్లక్ష్యానికి గురై విలువైన సామాగ్రి చోరీకి గురి కావడంతో మరలా మూలన పడి పోయింది. ఖరీఫ్ కాలం అంతా అధిక వర్షాలతో రైతులు పూర్తి దెబ్బతిన్నారు. కనీసం రబీ కాలం అయినా పంటలు పండించుకుందామంటే ఎత్తిపోతల పనిచేయకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమిటీ చైర్మనే చూసుకోవాలి

ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి మార్చి నెలలోనే చోరీకి గురైంది. ఇక్కడి వ్యవహారం అంతా కమిటీ చైర్మన్, సంఘం నాయకులే చూసుకోవాలి.

● ఏఈ నారాయణ రెడ్డి

నిధులు మంజూరు చేయాలి



ఈ ఎత్తిపోతల పథకాలపై గత ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. కనీసం నిర్వహణ కోసం నిధులు మంజూరు చేయలేదు. ఈ ప్రభుత్వమైనా ఎత్తిపోతల నిర్వహణకు నిధులు మంజూరు చేసి ఆదుకోవాలి.

● రాజు, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు

డిస్ట్రిబ్యూటరీలు పని చేయడం లేదు



నాగటూరు ఎత్తిపోతల పథకం కింద నాకు మూడు ఎకరాల పొలం వుంది. నాగటూరు ఎత్తిపోతల నీరు అందాలంటే నీరందించే డిస్ట్రిబ్యూటరీలు వుండాలి. అవి సరిగ్గా పనిచేయడంలేదు. మరమ్మతు చేయించాలి.

● సుధాకర్, నందికొట్కూరు, రైతు

పోలీసులు, పీపీల మధ్య సమన్వయం అవసరం

● డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సరళాదేవి

నంద్యాల టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కేసులను ఛేదించే విషయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసుల మధ్య సమన్వయం ఉండాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సరళాదేవి అన్నారు. శనివారం స్థానిక రామకృష్ణా పీజీ కళాశాలలో కో ఆర్డినేషన్‌పై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమెతో పాటు నంద్యాల ఏఎస్పీ మందా జావళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక వ్యక్తి నేరం చేసినప్పుడు అరెస్టు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కోర్టులో హాజరుపరిచే సమయంలో పోలీసులు ముందుగా తీసుకోవాల్సిన విధి విధానా లను వివరించారు. దర్యాప్తు అధికారి నేరం చేసిన వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకోవడంలో కీలక పాత్ర పోషించాలని కేసు విషయంలో అన్ని ఆధారాలు కోర్టుకు సమర్పించాలని తెలిపారు. కేసుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎలాంటి సమయంలో ఎలా వ్యవహరించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాస్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసులు, మహేశ్వరి, ఏపీపీ మోతీలాల్ ఎస్‌వీవీ సీవీ శ్రీనివాసులు పీపీలు, సీఐలు సుధాకర్‌రెడ్డి, కంబగిరిరాముడు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్న పీపీలు, పోలీసులు

బిర్సాముండా జయంత్యుత్సవం



శ్రీశైలం మేకలబండ గిరిజనులతో ఛైర్మన్ రమేష్‌నాయుడు

శ్రీశైలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : 130 సంవత్సరాలకు పూర్వం బ్రిటీష్‌వారిపై తిరుగుబాటు చేసి గిరిజన యువకుల్లో స్ఫూర్తి నింపిన బిర్సా ముండాను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆలయ చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు అన్నారు. శనివారం క్షేత్ర పరిధిలోని మేకల బండ గిరిజనతండాలోని కమ్యూనిటీహాల్ వద్ద బిర్సా 150వ జయంత్యుత్సవ వేడుకలను చెంచు యువతతో కలసి జరుపుకున్నారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ చెంచు యువతకు పలు సూచనలు చేశారు. గిరిజనులు తమ సాంప్రదాయ నృత్యాలతో బిర్సాకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డ్ సభ్యురాలు గంగమ్మ, శివాజి స్ఫూర్తికేంద్రం నిర్వాహకుడు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సీఐ సతీశ్ కుమార్‌కు ఘన నివాళి 7

జార్ఖండ్ మత్స్యకారుల గుర్తింపు
● త్వరలో వారి సొంత ప్రాంతానికి తరలింపు
● ఎస్పీ ఆదేశాల మేరకు విచారణ

ఇద్దరు వేటగాళ్ల అరెస్టు 7

శ్రీగిరి క్షేత్రం.. కార్తీక శోభితం

శ్రీశైలంలో పెరిగిన భక్తుల రద్దీ

శ్రీశైలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహా పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసుకుని కార్తీక దీపాలు వెలిగించేందుకు భక్తులు వేలాదిగా తరలిరావడంతో శనివారం క్షేత్ర ప్రాంతాలన్నీ రద్దీగా కనిపించాయి. వారాంతపు సెలవు రోజులతోపాటు కార్తీకమాసం చివరి వారం కావడం వల్ల ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరాది రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివస్తున్నారు. యాత్రికులతో శ్రీగిరిలోని వసతి సముదాయాలు కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దర్శనాలు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకున్నట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. స్వామిఅమ్మవార్ల ఉభయ దేవాలయాల్లో అందరికీ అలంకార దర్శనం మాత్రమే ఉన్నందున దర్శనానికి రెండు గంటల సమయం మాత్రమే పడుతోందని ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం పది గంటల నుంచి అన్నప్రసాదాన్ని అందుబాటులో ఉంచుతూ క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు అల్పాహారం, పాలు, మంచినీరు అందిస్తున్నారు. గంగాధర మండపం వద్ద, శివాజీ గోపురం మాడవీధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉసిరి చెట్ల కింద భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.



కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేస్తున్న యాత్రికులు



కంపార్ట్‌మెంట్‌లో వేచిఉన్న భక్తులు

హాస్టళ్లలో మౌలిక వసతులు పెరగాలి

కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి హాస్టల్ వార్డెన్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో ఎస్సీఎస్టీ, బీసీ, ట్రైబల్‌వెల్ఫేర్, కేజీబీవీ, మోడల్‌స్కూళ్లకు సంబంధించిన హాస్టళ్ల, వసతులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న పిల్లలను వారి తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో వదలి వెళ్తారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, శుభ్రత, చదువు విషయంలో వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గత ఏడాది పదోతరగతిలో 82 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారని, ఈ ఏడాది విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు యాక్షన్‌ప్లాన్ రూపొందించుకోవాలని సూచించారు. వసతిగృహాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ అధికారి చింతామణి, బీసీ సంక్షేమ శాఖ అధికారి గిడ్డయ్య, డీఈఓ జనార్దన్‌రెడ్డి, సమగ్రశిక్ష ప్రాజెక్టు కో.ఆర్డినేటర్ ప్రేమనాథ్ కుమార్, గురుకుల కో.ఆర్డినేటర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మార్కెట్ యార్డు గోదాములు

- త్వరలో రైతులకు అందుబాటులోకి..
- గత వైసీపీ నిర్వాకంతో ఎనిమిదేళ్లుగా పెండింగ్



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బనగానపల్లె మార్కెట్ యార్డు గోదాము

బనగాన పల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని మార్కెట్ యార్డు ప్రభుత్వ గోదాముల నిర్మాణ పనులు గత 8 ఏళ్లనుంచి నిలిచిపోయాయి. రైతులు ప్రైవేటు గోదాముల్లో ధాన్యం దాచుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని మార్కెట్ యార్డు గోదాముల పనులకు టెండర్లు నిర్వహించేలా రీటెండర్లు పిలిపించి గోదాముల నిర్మాణం పనులను పునః ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు.

ఎనిమిదేళ్ల క్రితం నిలిచిన గోదాముల నిర్మాణం పనులు

బనగానపల్లె పట్టణంలోని మార్కెట్ యార్డును 1997 సంవత్సరంలో 24 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఈ మార్కెట్ యార్డు నిర్మించే సమయంలో కేవలం ఒకే ఒక్క గోదామును నిర్మించారు. కేవలం 365 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే రైతులు నిల్వ చేసుకోవడానికి ఉంది. దాదాపు 27 ఏళ్లు పూర్తి అయినా ఒకే ఒక్క గోదాము మార్కెట్ యార్డుకు ఉంది. ఈ గోదాము రైతులకు ఏ మాత్రం సరిపోదు. 2018లో అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి రూ.1.10 కోట్లతో మార్కెట్ యార్డులో రెండు గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఒక్కో గోదాము 1500మెట్రిక్ టన్నుల ధాన్యం పట్టే విధంగా రెండు గోదాముల్లో 3వేల మెట్రిక్ టన్నులు రైతులు ఈగోదాములో ధాన్యాన్ని నిల్వ చేసుకొనేందుకు నిధులు మంజూరు చేశారు.

పూర్తి కావచ్చిన పనులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టి సారించారు. మంత్రి చొరవతో తిరిగి రీటెండర్లు పిలిపించి గోదాము పనులకు టెండర్లు వేయించారు. రూ.37 లక్షలు ఒక గోదాముకు, మరో గోదాముకు రూ.47 లక్షలతో టెండర్లు పిలువడంతో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభింపజేశారు. ఓ గోదాము నిర్మాణం పనులు పూర్తికాగా మరో గోదాము పనులు కావచ్చాయి. త్వరలో ఇవి రైతులకు అందుబాటులోకి రానున్నాయి.

రివర్స్ టెండరింగ్ విధానంతో ఆగిన నిర్మాణ పనులు

గోదాముల నిర్మాణం పనులు 2018లో ప్రారంభమయ్యాయి. 2019 నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రివర్స్ టెండరింగ్ విధానం వల్ల కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడంతో గోదాముల నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. రూ. 1.10 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ గోదాములకు గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తిగా నిలిపివేశారు.

రైతులకు మోయలేని భారంగా మారిన ప్రైవేటు గోదాముల ఖర్చు

ప్రైవేటు గోదాముల్లో రైతులు తమ పంటలను నిల్వ ఉంచుకోవాలంటే మోయలేని భారం పడుతోంది. గతంలో సంవత్సరం ఒక్కొక్క బస్తాను ప్రైవేటు గోదాముల్లో నిల్వ ఉంచితే సంవత్సరానికి రూ.35 వసూలు చేసేవారు. ప్రైవేటు గోదాముల యజమానులు బస్తాకు నెలకు రూ.7చొప్పున సంవత్సరానికి రూ.84 పెంచారు. దీనికి తోడు ఇన్సురెన్సు కూడా రైతులు చెల్లించాలి. అదే ప్రభుత్వ గోదాము అయితే నెలకు కేవలం నామినల్ అద్దె వసూలు చేస్తారు. ఆరు నెలల వరకు రైతు ధాన్యాన్ని ప్రభుత్వ గోదాముల్లో ఉచితంగా పెట్టుకోవచ్చు. అందుకే ప్రభుత్వ గోదాముల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.



రైతులకు అందుబాటులోకి తెస్తాం



మార్కెట్‌యార్డు గోదాముల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఒక గోదాము నిర్మాణం పూర్తయింది. మరో గోదాము పనులు నెల రోజుల్లో పూర్తవుతాయి. త్వరలో రైతులకు అందుబాటులోకి తెస్తాం.

-కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్, బనగానపల్లె

పరిశ్రమల్లో డేటా సైన్స్ అవసరం

● జర్మనీ ఎల్‌పీడీజీ సంస్థ సీఈవో మాథియాస్



ఆర్జీఎం కళాశాల అధ్యాపకులతో సీఈవో మాథియాస్

పాణ్యం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం డేటా సైన్స్ ఆవశ్యకత పరిశ్రమల్లో ఎంతో అవసరమని జర్మనీకి చెందిన లెహ్మాన్ పయనీర్స్ డిజిటల్ గ్రూప్ సంస్థ సీఈవో మాథియాస్ అన్నారు. శనివారం ఎల్‌పీడీజీ ఇండియా డైరెక్టర్ రంజిత్, డేటాసైంటిస్ట్ కల్యాణతో కలిసి ఆయన ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించారు. విద్యార్థులకు డేటా సైన్స్ ప్రాముఖ్యత, భవిష్యత్తు అవకాశాలు, పరిశ్రమల్లో పెరుగుతున్న అవసరం గురించి వివరించారు. ముఖ్యంగా డేటా ఆధారిత నిర్ణయాల ప్రాముఖ్యతపై అంతర్జాతీయ కంపెనీల్లో డేటా సైన్స్ నైపుణ్యాల డిమాండ్‌పై అవగాహన కల్పించారు స్టార్టప్, పరిశోధన, ఆవిష్కరణల రంగాలలో కృషి చేయనున్నట్లు తెలిపారు. కళాశాలలో ఇన్నోవేషన్ అండ్ ఇన్‌క్యుబేషన్ సలహాదారుడిగా కొనసాగేందుకు అంగీకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, సీఎస్ఈ (డేటాసైన్స్) హెచ్‌వోడీ భాస్కరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి



మంత్రాలయంలో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ సచిన్ శంకర్ మగదూమ్

మంత్రాలయం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సచిన్ శంకర్ మగదూమ్ కుటుంబ సమేతంగా శనివారం మంత్రాలయానికి వచ్చారు. మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహామూర్తి వీరికి ఘనంగా స్వాగతం పలికారు. జడ్జి, ఆయన కుటుంబ సభ్యులు గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట అనంత పురాణిక్, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజిల్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి

ఆదోని రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలంలోని ధణాపురం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ రాజేశ్(30) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఆదోని పట్టణానికి చెందిన రాజేశ్ వృత్తి రీత్యా ఫొటోగ్రాఫర్. ఇందులో భాగంగానే ఆలూరు నియోజకవర్గం హాలహర్వి మండలంలో ఓ శుభకార్యానికి స్నేహితుడు ఈరన్నతో కలిసి శుక్రవారం ఉదయం బయల్దేరాడు. సాయంత్రం తిరిగి ఆదోనికి ద్విచక్ర వాహనంలో బయల్దేరారు. ధణాపురం శివారులో వీరికి పశువులు అడ్డు రావడంతో వాటిని తప్పించే క్రమంలో బైకు అదుపుతప్పింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాజేశ్‌ను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బాధిత బంధువులు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అర్ధరాత్రి రాజేశ్ పరిస్థితి మరింత విషమంగా ఉండడంతో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు.



రాజేశ్(ఫైల్)

కోరుమానుపల్లెలో పట్టపగలే చోరీ

● 4 తులాల బంగారం, రూ.6వేల నగదు అపహరణ

కొలిమిగుండ్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుమాన్‌పల్లె గ్రామంలో శనివారం పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రాజారెడ్డి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి గ్రామ సమీపంలో జరుగుతున్న గుండం ఆంజనేయస్వామి తిరునాళ్లకు వెళ్లారు. తాళం వేసి పక్కన గూటిల్లో తాళంచెవులు పెట్టి వెళ్లారు. దీంతో తాళం ఓపెన్ చేసిన దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలోని 4 తులాల బంగారం, రూ.6 వేలు నగదు ఎత్తుకెళ్లారు. ఎస్ఐ గోపాల్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



దుండుగలు తెరిచి ఉంచిన బీరువా

పోక్సో కేసులో వ్యక్తికి రిమాండు


కోవెలకుంట్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పోక్సో యాక్టు కేసులో బొంతల రాజకుమార్‌కు కర్నూలు జిల్లా పోక్సో కోర్టు రిమాండు విధించినట్లు కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాలివీ.. చాగలమర్రికి చెందిన రాజకుమార్ పోక్సో కేసులో కర్నూలు కోర్టుకు వాయిదాలకు రాకుండా తప్పించుకుని తిరుగుతుండడంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, హెడ్ కానిస్టేబులు నాగన్న, పీసీ చాంద్‌బాషా కలిసి రాజకుమార్‌ను అరెస్టు చేశారు. కర్నూలు కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండుకు ఆదేశించినట్లు తెలిపారు

యువకుడి ఆత్మహత్య

కోవెలకుంట్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దాసరి వీధికి చెందిన ఓ యువకుడు ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం జరిగింది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలివీ..పట్టణంలోని దాసరి వీధిలో తల్లి సుజాత, కుమారుడు నట్వ గణేశ్ ఇద్దరూ నివాసం ఉంటున్నారు. గణేశ్ వండేమార్ట్‌లో ఏడాది క్రితం పనిచేసి ఇటీవలనే మానుకున్నాడు. తల్లి సుజాత ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తుండేది. శనివారం తల్లి పాఠశాలకు వెళ్లగా ఇంట్లో ఎవరు లేని సమయంలో నట్వ గణేశ్ (24) ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. తల్లి పాఠశాల నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో కుమారుడు ఉరి వేసుకొని కనిపించాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రావెల్స్ మినీ బస్సుకు భారీ జరిమానా

డోన్ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అమకతాడు టోల్‌ప్లాజా వద్ద ఆర్టీవో అధికారులు ట్రావెల్స్ మినీ బస్సు భారీ జరిమానా విధించారు. హైదరాబాదు నుంచి యాగంటికి వెళుత్తున్న బస్సుకు ఎటువంటి ఫిట్‌నెస్ లేకుండా, ఏపీ రాష్ట్రానికి ట్యాక్స్ కట్టకుండా రోడ్డుపై నడుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. రూ.86,200 భారీ జరిమానా విధించినట్లు ఆర్టీవో క్రాంతికుమార్ తెలిపారు. మినీ బస్సును జప్తు చేసి డోన్ ఆర్టీసీ డిపోకు తరలించారు.



జప్తు చేసిన ట్రావెల్స్ మినీ బస్సు

రైల్వే సీఐ సతీశ్ కుమార్‌కు ఘన నివాళి

● పత్తికొండలో ముగిసిన అంత్యక్రియలు

● నివాళులర్పించిన ప్రముఖులు, రాజకీయ నేతలు

పత్తికొండ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల పరకామణి చోరీ వ్యవహారంలో ఫిర్యాదుదారు, గుంతకల్లు రైల్వే డివిజన్ జీఆర్పీ సీఐ వై.సతీశ్‌కుమార్ అంత్యక్రియలు శనివారం పత్తికొండ పట్టణంలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో జరిగాయి. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం కోమలి గ్రామ సమీపంలో రైల్వేట్రాక్ వద్ద శుక్రవారం ఉదయం ఆయన మృతదేహం కనిపించిన విషయం తెలిసిందే. అనంతపురం జీజీహెచ్‌లో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో స్వగ్రామమైన పత్తికొండకు మృతదేహాన్ని బంధువులు తీసుకొచ్చారు. అందరికీ సుపరిచితుడిగా ఉంటూ మంచి పేరు సంపాదించుకున్న సతీశ్ కుమార్ మృతదేహం పత్తికొండకు వచ్చిందన్న వార్త విన్న బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళులర్పించారు. దీంతో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్, శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి తదితరులు సీఐ సతీశ్ కుమార్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా సీపీఐ రాష్ట్ర నాయకులు రామచంద్రయ్య, న్యాయవాది సురేంద్రకుమార్, వైసీపీ నాయకులు రామచంద్రారెడ్డి, నాగరత్నమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు క్రాంతినాయుడు, సీపీఎం పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. పోలీసు సిబ్బందితో కలిసి గుంతకల్లు రైల్వే డీఎస్పీ శ్రీనివాస ఆచారి నివాళులర్పించారు. రైల్వేశాఖ తరపున అంత్యక్రియలకు రూ.లక్ష నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం శ్మశాన వాటికలో రైల్వే పోలీసులు మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపి అధికార లాంఛనాలతో అంతిమ సంస్కారాలను నిర్వహించారు.



అంతిమ యాత్రలో పాల్గొన్న తుగ్గలి నాగేంద్ర, పోలీసులు,

సతీష్‌కుమార్ మృతి బాధాకరం

పత్తికొండకు చెందిన సీఐ సతీష్‌కుమార్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో మంచి గుర్తింపు పొందారు. ఆయన అకాల మృతి చాలా బాధాకరం. ఈయన మృతి పట్ల ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తుంది. దీని వెనుక ఎంతటివారు ఉన్నా సరే ఉపేక్షించేది లేదు. పరకామణి కేసులో సీఐ సతీష్ కుమార్ నిక్కచ్చిగా వ్యవహరించారు. అప్పట్లో అనంతపురం జిల్లాకు చెందిన టీడీపీ నేత పరిటాల రవి హత్యకు గురైన కేసులో సాక్షులు ఒక్కొక్కరు మాయమయ్యారు. ఇప్పుడు సతీష్‌కుమార్ మృతిని గమనిస్తే అదే గుర్తుకు వస్తోంది. కేసులో ఉన్న సాక్షులను భయభ్రాంతులకు గురిచేసేలా ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్న నిందితులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. ఈ సంఘటనలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్తా. బాధిత కుటుంబానికి అండగా ఉంటాను.

- కేఈ శ్యామ్‌కుమార్, ఎమ్మెల్యే, పత్తికొండ

బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం

కుమ్మరి శాలివాహన సామాజికవర్గానికి చెందిన సతీశ్ కుమార్ మృతి సంఘటనలో ఎంతటివారు ఉన్నా ప్రభుత్వం వారిని వదిలిపెట్టదు. సతీశ్ కుటుంబానికి న్యాయం చేస్తాం. పరకామణిలో జరిగిన చోరీ కేసులో ప్రధాన సాక్షిగా ఉన్న సతీశ్‌ను కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులే హత్య చేసి ఉంటారు. ఇప్పుడిప్పుడే శాలివాహన సామాజికవర్గం, ఆర్థిక, రాజకీయంగా, ఉద్యోగాలపరంగా ఎదుగుతున్న తరుణంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరం.

● తుగ్గలి నాగేంద్ర, శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

విచారణ జరిపించాలి

రైల్వే సీఐ సతీశ్ కుమార్ మృతిపై అనుమానాలు ఉన్నాయి. సీబీఐ చేత విచారణ చేపట్టాలి. పరకామణి ఘటన కేసులో సాక్ష్యం చెప్పేందుకు వెళ్తున్న సీఐ స్థాయి అధికారి రైలులో వెళ్తూ హత్యకు గురికావడం దారుణం. టీటీడీలో ఇప్పటికే కల్తీ లడ్డు, పరకామణి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడాలి. బాధితా కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

● రామచంద్రయ్య, సీపీఐ రాష్ట్ర నేత



మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్

టీజీవీ కళాక్షేత్రం ఖ్యాతి విశ్వవ్యాప్తం కావాలి

మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో కళాకారుల నిలయం టీజీవీ కళాక్షేత్రం ఖ్యాతిని విశ్వవ్యాప్తం కావాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ ఆకాంక్షించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్యకు ప్రతిష్ఠాత్మక జీవన సాఫల్య పురస్కారాన్ని తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సంస్థ హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అందజేసి గౌరవించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో పత్తి ఓబులయ్యను ఎంపీ టీజీ వెంకటేశ్ శనివారం ఘనంగా సత్కరించారు. కళాక్షేత్రం సభ్యులు పాల్గొన్న ఈ సభలో టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ కర్నూలు కళాకారులకు కేరాఫ్‌గా ఉన్న టీజీవీ కళాక్షేత్రం సాంస్కృతిక నిలయంగా మారాలన్నారు. ఇతర సభ్యులు కూడా కళాసేవ చేస్తూ అవార్డులు అందుకోవాలన్నారు. పత్తి ఓబులయ్య కళాక్షేత్రం అభివృద్ధికి, కొత్త కళాకారులను తయారు చేయడంలో తన జీవితాన్ని ధారపోశారన్నారు. ఇలాంటి అవార్డులు ఆయన మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. తన జీవితంలో ఇంతటి గొప్ప అవార్డు రావడం మర్చిపోలేని ఘట్టమన్నారు. కళామతల్లి ముద్దుబిడ్డ టీజీ వెంకటేశ్ ప్రోత్సాహంతో పాటు కళాక్షేత్రం కార్యవర్గ సభ్యుల సహకారంతోనే ఇలాంటి ప్రతిష్ఠాత్మక అవార్డులు సొంతమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి యాంగటీశ్వర్, కోశాధికారి కె.రామస్వామి, ఉపాధ్యక్షులు గజల్ మహ్మద్ మియ, సీవీ రెడ్డి, దాశెట్టి శ్రీనివాసులు, కళాక్షేత్రం సభ్యులు శివయ్య, కె.వి. రమణ, ఇనాయతుల్లా, సంగా ఆంజనేయులు, ఈశ్వరయ్య, బాల వెంకటేశ్వర్లు, ఎన్‌డీ క్రిష్టఫర్, కదిరి రమేష్, కాంతారావు, చంద్రకంటి మద్దయ్య, హెచ్‌ఎం వాల్మీకి రాముడు తదితరులు పాల్గొన్నారు.



పత్తి ఓబులయ్యను సత్కరిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

నేడు గజ్జ కట్టిన పల్లెబాట : కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు 'గజ్జ కట్టిన పల్లె బాట' పేరిట జానపద గేయాల సంగీత విభావరి కార్యక్రమం ఉంటుందని గజల్ గాయకులు మహ్మద్ మియ తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం పత్తి ఓబులయ్య ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి నగర ప్రజలు, సంగీత అభిమానులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రముఖ జానపద కళాకారులు ఖాజా వలి, మిమిక్రి ఆర్టిస్ట్ ఉస్మాన్ భాష, గాయకులు సుజాత తదితరులు పాల్గొంటారని తెలిపారు.

జార్ఖండ్ మత్స్యకారుల గుర్తింపు

● త్వరలో వారి సొంత ప్రాంతానికి తరలింపు

● ఎస్పీ ఆదేశాల మేరకు విచారణ

పగిడ్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో చేపల వేటకు వచ్చిన జార్ఖండ్ మత్స్యకారులను గుర్తించి వారి స్వగ్రామాలకు పంపిస్తున్నట్లు నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. జార్ఖండ్‌కు చెందిన తోఫుజుల్, అబుసోబ్‌సెట్ తమకు తెలిసిన వారి ద్వారా విజయవాడలోని కొండపల్లిలో కెమికల్ ఫ్యాక్టరీలో పని చేసేందుకు వచ్చారు. అక్కడ పని నచ్చకపోవడంతో తిరిగి వెళ్లేందుకు బస్టాండ్ ఆవరణలో తిరుగుతు ఉన్నారు. ఈ సమయంలో విజయవాడకు చెందిన సింహచలం అనే వ్యక్తి కూలీ పని ఇప్పిస్తానని చెప్పి వారిని విజయవాడ నుంచి 20 రోజుల కిందట తెలంగాణ రాష్ట్రం కూడెల్లి వద్ద కృష్ణనదిలో చేపలు పట్టేందుకు తీసుకొనివచ్చారు. అక్కడ సరైన వసతులు లేకపోవడంతో వారు ఆ విషయాన్ని తమ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారు నంద్యాల ఎస్పీకి సమాచారం ఇచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ సిబ్బంది శనివారం ఉదయం నెహ్రూనగర్ గ్రామ సమీపంలోని మూర్వకొండ ఘాట్ నుంచి కృష్ణనదిలో ఇంజన్ బోట్‌లో నదీతీర ప్రాంతం వెంట ఉన్న మత్స్యకారుల క్యాంప్‌లను సందర్శించి జార్ఖండ్ మత్స్యకారుల కోసం గాలించారు. కేడేళ్లి వద్ద ఉన్న జార్ఖండ్ మత్స్యకారులను అదుపులోకి తీసుకొని విచారించారు. వారి స్వగ్రామాలకు పంపే ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



నదీతీరం వెంట జార్ఖండ్ మత్స్యకారుల కోసం విచారిస్తున్న సీఐ

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

డోన్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యమివ్వాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాయలసీమ యూనివర్సిటీ అంతర్ కళాశాల పోటీలకు ఎమ్మెల్యే కోట్ల ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక దృఢత్వానికి ఎంతో దోహద పడుతాయన్నారు. క్రీడల్లో రాణించేందుకు ఉపాధ్యాయులు కూడా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ పోటీల్లో ఫుట్‌బాల్, చెస్ పోటీలకు 15 జట్లు పాల్గొన్నాయి. అంతకు ముందు విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, రాయలసీమ యూనివర్సిటీ వీడీ శివకిషోర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, లక్కసాగరం లక్ష్మిరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాఘవేంద్రగౌడు, మాజీ సర్పంచ్ పెద్ద కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మరి సుధాకర్, జలదుర్గం ఆర్ఈ నాగరాజు గౌడు, ఓంప్రకాష్, ప్రిన్సిపాల్ భారతి, గుండాల జయరాముడు, మోహన్‌గౌడు, పీడీ చంద్రశేఖర్, బ్రహ్మయ్య, రెహిమాన్, హుసేన్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

ఇద్దరు వేటగాళ్ల అరెస్టు

● పరారీలో మరో ఇద్దరు

● అడవి పంది కళేబరం, 6 కత్తులు స్వాధీనం

రుద్రవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం ఫారెస్టు రేంజ్‌లోని అహోబిలం గ్రామ సమీపంలో వన్యప్రాణిని కరెంటు పెట్టి వేటాడిన కేసులో శనివారం ఇద్దరిని అరెస్టు చేసినట్లు రేంజర్ ముర్తుజావలి తెలిపారు. అహోబిలం చెందిన నాగేశ్వర్‌రెడ్డి, ఓబులేసును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెతెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారయ్యాని చెప్పారు. నిందితుల నుంచి ఆరు కత్తులు, అడవి పంది కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న కళేబరానికి పశువైద్యాధికారిచే పోస్టుమార్టం నిర్వహించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖననం చేసినట్లు ఆయన తెలిపారు. ఇన్‌చార్జి డిప్యూటీ రేంజర్ ముక్తర్‌బాషా, సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాస రెడ్డి, రామకృష్ణ, రాణెమ్మ, బీట్ ఆఫీసర్లు హుసేనయ్య, జేమ్స్‌పాల్, సురేంద్రగౌడ్ పాల్గొన్నారు.



రుద్రవరంలో వన్యప్రాణి వేటగాళ్లతో ఫారెస్టు రేంజర్, సిబ్బంది

ఉరేసుకొని విద్యార్థి బలవన్మరణం

నంద్యాల టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో పదో తరగతి విద్యార్థి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నంద్యాలలో శనివారం చోటు చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. పట్టణంలోని ముల్లాన్‌పేటకు చెందిన ప్రజ్వల్ (15) స్థానిక ఒక ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సరిగా వెళ్లేవాడుకాదు. పరీక్షలు దగ్గర పడుతుండటంతో సరిగా రాయలేకపోతానేమోనని కలత చెందేవాడు. తండ్రి దినేశ్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. తల్లి ప్రవళ్లిక స్థానిక నర్సింగ్‌హోం నర్సుగా పని చేస్తున్నారు. ఉదయం పాఠశాలకు వెళ్లమని చెప్పి ఆస్పత్రికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మనస్థాపం చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసేలోగా మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రామ్‌కో పరిశ్రమలో పశ్చిమ బెంగాల్ కార్మికుడి మృతి

కొలిమిగుండ్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో మెకానిక్ విభాగంలో గ్రైండర్‌గా విధులు నిర్వహిస్తున్న పశ్చిమబెంగాల్ కార్మికుడు నాని గోపాల్ ఆచారి (51) శనివారం మృతి చెందాడు. ఉదయం కొళాయి వద్ద నీరు తాగుతుండగా అకస్మాత్తుగా కింద పడిపోయారని తోటి కార్మికులు తెలిపారు. పరిశ్రమ సిబ్బంది గోపాల్ ఆచారిని తాడిపత్రి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు నాని గోపాల్ ఆచార్ పశ్చిమబెంగాల్ రాష్ట్రం రుబ్రామెదినిపూర్ జిల్లా వాసిగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు వెల్లడించారు. ఇదిలా ఉండగా గత కొన్ని రోజులుగా రామ్‌కో పరిశ్రమలో కార్మికుల మరణాలు కలవరపెడుతున్నాయి. ఫ్యాక్టరీలో చోటు చేసుకుంటున్న పరిణామాలు, కార్మికుల మరణాలపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.



గోపాల్‌ఆచార్ (ఫైల్)

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఫిర్యాదులపై విచారణ తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి ప్రేమంత్‌కుమార్

బండి ఆత్మకూరు, నవంబరు15(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు విచారించి పరిష్కారం చూపాలని పీజీఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ప్రేమంత్‌కుమార్ సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారాలపై శనివారం తహసీల్దారు కార్యాలయంలో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై సమగ్ర విచారణ జరిపించి వివరంగా ఫిర్యాదుదారుడికి తెలియజేయాలన్నారు. ప్రజా ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ నరసింహుడు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

శాంతిరాం ఆస్పత్రిలో పిన్ హోల్ సర్జరీ


రోగితో శాంతిరాం ఆస్పత్రి వైద్య సిబ్బంది

నంద్యాల హాస్పిటల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శాంతిరాం ఆస్పత్రిలో శనివారం వైద్యులు ఓ రోగికి మెదడుకు సంబంధించి పిన్‌హోల్ సర్జరీ విజయవంతంగా నిర్వహించారు. కోత, కుట్లు లేకుండా ప్రాణాపాయం నుంచి రక్షించారు. అత్యంత క్లిష్టమైన బ్రెయిన్ అన్యూరిజం రక్తస్రావానికి ఆధునిక చికిత్స అందించారు. వైద్యులు నవీన్‌కుమార్, శివరాంరెడ్డి పర్యవేక్షణలో ఆపరేషన్ విజయవంతం చేశారు. వైద్యులను శాంతిరాం ఆస్పత్రి డైరెక్టర్ అండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మిద్దె రఘురాం, జనరల్ మేనేజర్ ఫ్రాన్సిస్, చీఫ్ ఆఫీసర్ శ్రీకాంత్ అభినందించారు.

గుండెపోటుతో డీఈ ఉమాకాంత్‌రెడ్డి మృతి



ఆత్మకూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఉమాకాంత్‌రెడ్డి (56) శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. వివరాలిలా.. ఉయ్యాలవాడ మండలంలోని ఇంజేడు గ్రామానికి చెందిన డీఈ ఉమాకాంత్‌రెడ్డి కర్నూలులో నివాసం ఉంటున్నారు. ఏడాది క్రితం ఆత్మకూరుకు బదిలీపై రావడంతో పట్టణంలోని స్వరాజ్‌నగర్‌లో ఆయనొక్కరే నివాసం ఉన్నారు. అయితే శుక్రవారం రాత్రి అనారోగ్యంగా ఉందని, సహచర సిబ్బందికి తెలిపాడు. అంబులెన్స్‌లో కర్నూలుకు తీసుకెళ్తుండగానే కరివేన సమీపంలో గుండెపోటుతో మృతిచెందారు. మృతదేహాన్ని కర్నూలులోని స్వగృహానికి తరలించారు. భార్య కళావతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఉమాకాంతరెడ్డి మృతిపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

'పది' పరీక్షా కేంద్రాల తనిఖీ

పాణ్యం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది మార్చిలో నిర్వహించనున్న పది పరీక్షా కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ రఘురామిరెడ్డి పరిశీలించారు. శనివారం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విజయానికేతన్, బలపనూరు గిరిజన గురుకుల, బీసీ గురుకులపాఠశాలలు, జడ్పీ ఉన్నత పాఠశాలల రికార్డులు, తాగునీటి, మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్యాన్లు, తదితర సౌకర్యాలు పరిశీలించారు. ఏమైనా మరమ్మతులుంటే త్వరగా పూర్తి చేసుకోవాలని ఆదేశించారు.

వస్తు ప్రీతి దుఃఖానికి కారణం

- ఇస్కాన్ ధర్మ ప్రచారకుడు కీర్తిరాజదాస్ స్వామి

పగిడ్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిజమైన శ్రేయస్సుకు మోక్షమే మార్గమని, వస్తుప్రీతి సుఖాన్ని అందించకపోగా దుఃఖానికి కారణమవుతుందని ఇస్కాన్ ధర్మ ప్రచారకుడు కీర్తిరాజదాస్ స్వామి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ప్రాతకోట గ్రామంలోని మోక్షేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమంలో శనివారంతో ముగిసింది. గ్రామంలో భక్తులతో సామూహిక కుంకుమార్చన, గోపూజ నిర్వహించారు. శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీత, వేంకటేశ్వర స్వామి అవతరణ విశేషాలు తెలియజేశారు. కార్యక్రమంలో మల్లు వెంకటరెడ్డి, సర్పంచ్ శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బిర్సా ముండా జీవితం నేటి తరానికి స్ఫూర్తి

ఆత్మకూరురూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి గిరిజన వీరుడు బిర్సా ముండా జీవితం నేటి తరానికి స్ఫూర్తి అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా అన్నారు. శనివారం అమలాపురం చెంచు గూడెంలో గిరిజన వాసులతో కలిసి బిర్సా ముండా జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీజేపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మహానంది, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కేసీ కెనాల్ ప్రాజెక్ట్ అధ్యక్షుడు రామలింగారెడ్డి అన్నారు. శనివారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో టీడీపీ నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హౌసింగ్ గోటాకింగ్ కింద మండలంలో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి దరఖాస్తు చేసుకునేలా ఆయా గ్రామాల్లోని కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పార్టీలక తీతంగా లబ్ధిదారులను గుర్తించి ఈ పథకానికి ఎంపిక చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు రమాదేవి, ఎంపీపీ యశస్విని, హౌసింగ్ ఏఈ షఫివుల్లా, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

ముక్క మంచిదేనా?

- ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్న వ్యాపారులు
- మాంసం విక్రయాలపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ఆత్మకూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో రోజురోజుకు మాంసం విక్రయాలు పెరిగిపోతున్నాయి. దీనికి తగ్గట్లుగా జంతువధశాలలు ఏర్పాటు చేయడం లేదు. దీంతో ఎక్కడపడితే అక్కడే జంతువులను వధించి మాంసం విక్రయిస్తున్నారు. పశువైద్యాధికారి పరిశీలించి, ధ్రువీకరించి, ముద్రవేయాల్సి ఉన్నప్పటికీ ఆ నిబంధనలు పాటించడం లేదు. తూకాల్లో మోసాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టడం లేదని మాంస ప్రియులు ఆందోళన చెందుతున్నారు.

ఆత్మకూరులో జిల్లాలోనే మరెక్కడా లేనివిధంగా మటన్ ధర కిలో రూ.1000 వరకు విక్రయిస్తున్నారు. ఇంత ధర వెచ్చించినప్పటికీ అది నాణ్యమైన మాంసమేనా..? అన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది. వాస్తవానికి పట్టణంలోని సంతమార్కెట్ ప్రాంగణంలో మటన్ విక్రయాలు జరుగుతుంటాయి. ప్రతి ఆదివారం వ్యాపారం జోరుగా సాగుతోంది. అయితే కొంతమంది మటన్ వ్యాపారులు చచ్చినా, రోగాల బారిన పడిన జీవాలను వధించి విక్రస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటి ని ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజలు సైతం రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

హోటళ్లకు నాసిరకం మటన్ విక్రయాలు..?

ఆత్మకూరు ప్రాంతంలోని కొంత మంది మటన్ విక్రేతలు చచ్చినా, రోగాల బారిన పడిన జీవాలను వధించి తక్కువ ధరలకే హోటళ్లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. హోటళ్ల నిర్వాహకులు సైతం ఇదే అదునుగా భావించి సొమ్ము చేసుకుంటున్నారు. మటన్ వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నా వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యారన్న విమర్శలు వస్తున్నాయి. మటన్ విక్రయాలు అపరిశుభ్రమైన ప్రదేశంలో జరుగుతుండటంతో అక్కడికి వచ్చే వినియోగదారులు సైతం తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నాణ్యమైన మటన్ విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మటన్

నాసిరకం విక్రయాలు జరగకుండా చర్యలు



చచ్చినా, రోగాల బారిన పడిన జీవాలను వధించరాదు. ఇలాంటి విక్రయాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. అలాగే మటన్ విక్రయ ప్రదేశాల్లో శుభ్రత ఉండేలా చూస్తాం. మటన్ వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇస్తాం. హోటళ్లలో సైతం నాసిరకంగా విక్రయాలు జరుపుతున్నట్లు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- రమేష్‌బాబు, కమిషనర్, ఆత్మకూరు

ప్రజలు భాగస్వాములు కావాలి

- కలెక్టర్ రాజకుమారి
- జిల్లా వ్యాప్తంగా 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'

నంద్యాల నూనెపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను శుభ్రం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రతను వ్యక్తిగత బాధ్యతగా, సామాజిక కర్తవ్యంగా భావించాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణం, ఆరోగ్యకర జీవనానికి, సమాజ అభ్యున్నతికి, అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందన్నారు. డీఆర్వో రాంనాయక్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సిబ్బంది కార్యాలయ ప్రాంగణంలో చెత్తను తొలగించారు. మొక్కల సంరక్షణ, పరిసరాలు శుభ్రపరిచారు. అనంతరం కలెక్టర్‌తో పాటు జేసీ కార్తీక్, అధికారులు, సిబ్బంది స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.


కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

పరిశుభ్రతే ఆరోగ్యం: ఆర్ఎం

నంద్యాల టౌన్: మన చుట్టు ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటామని ఆర్టీసీ ఆర్ఎం రజియా సుల్తానా అన్నారు. శనివారం బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ ప్రాంగణం శుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో పరిసరాలను ఎస్పీఆర్ కళాశాల విద్యార్థులు, సిబ్బందితో కలిసి శుభ్రం చేశామన్నారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం మాధవీలత, సిబ్బంది, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహెమాన్ అన్నారు. శనివారం పార్నపల్లెలో ఎంపీడీవో గాయత్రి, సర్పంచ్ షబ్బీర్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీలు నిర్వహించారు. చెత్తాచెదారం, మురుగు తొలగింపు పనులు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు పద్మావతమ్మ, ఏపీవో వసుధ, ఏవో పవన్‌కుమార్, ఏఈ లక్ష్మీనరసింహ, వెంకటరాముడు, డాక్టర్లు అనూష, జ్యోత్స్న పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

మహానంది: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో మహమ్మద్‌దౌలా అన్నారు. శనివారం మహానంది సమీపంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కలువ భాస్కర్, వీఆర్వో చలమయ్య, ప్రధానోపాధ్యాయుడు సత్యాలు, సచివాలయం సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి సూచించారు. శనివారం కొత్తపల్లి గ్రామంలో సర్పంచ్ నారాయణ, అయ్యలూరులో ఎంపీడీవో సుగుణశ్రీ, చాబోలులో డిప్యూటీ ఎంపీడీవో శివనాగజ్యోతి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

మిడుతూరు: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రత్యేక అధికారి జాకీర్‌హుశేన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రత్యేక అధికారి జాకీర్‌హుశేన్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దశరథరామయ్య, తహసీల్దారు శ్రీనివాసులు, టీడీపీ మండల కన్వీనర్ కాత రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

పగిడ్యాల: మండల కేంద్రంలో ఎంపీడీవో సుమిత్రమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్రపై విద్యార్థులతో కలిసి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంఈవో సుభాన్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు గృహాలు మంజూరు: ఎమ్మెల్యే

పగిడ్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి గృహాలు మంజూరు చేయనుందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. మండల పరిధిలోని పగిడ్యాల గ్రామంలో పీఎంఏవై పథకం కింద నిర్మించుకున్న గృహాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17 నెలలలోనే రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల పేదలకు పీఎంఏవై పథకం కింద గృహాలు మంజూరు చేసి నిర్మించడం గొప్ప విషయమన్నారు. పీఎంఏవై పథకం కింద పగిడ్యాలలో ఏడుగురు ఎస్టీ లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేసిందన్నారు. లబ్దిదారులకు ఇంటి నిర్మాణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనరు మహేశ్వర రెడ్డి, సొసైటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, వాసురెడ్డి, ఎంపీడీవో సుమిత్రమ్మ, హౌసింగ్ ఈఈ కృష్ణ రెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.


ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

ఫిన్‌లాండ్ ఎడ్యుకేషన్ విధానానికి ఒప్పందం

నంద్యాల ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ అత్యుత్తమ విద్యావిధానం కలిగిన ఫిన్‌లాండ్ ఎడ్యుకేషన్‌ను తమ విద్యాసంస్థల్లో ప్రవేశపెట్టేందుకు ఫిన్‌లాండ్ కోడ్ స్కూల్ చైర్మన్ కైసు పల్లాస్కాలియోతో ఒప్పందం చేసుకున్నట్లు శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ దుబాయ్‌లో జరిగిన ఫ్యూచర్ ఎడ్యుకేషన్- 2025 కార్యక్రమంలో నంద్యాల శ్రీ శాంతినికేతన్, శ్రీ సంకల్ప్ విద్యాసంస్థల్లో ఫిన్‌లాండ్ ఎడ్యుకేషన్ విధానం అమలు పరిచేందుకు ఎంవోయూ కుదుర్చుకున్నట్లు వివరించారు. ప్రపంచస్థాయి విద్యావిధానం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచడానికి, మెరుగైన ఫలితాలను సాధించడానికి ఉపకరిస్తుందన్నారు.


ఫిన్‌లాండ్ ప్రతినిధులతో శాంతినికేతన్ విద్యాసంస్థల ప్రతినిధులు

పిన్నాపురంలో 60 ఎకరాల కేటాయింపు

పాణ్యం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నాపురంలో పశువుల తాగునీటి, మేత అవసరాలకు 60 ఎకరాలు కేటాయించినట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు తెలిపారు. శనివారం పిన్నాపురంలోని పాడి రైతుల అవసరాలపై రైతులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి, సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి, మండల రైతు సంఘం అధ్యక్షుడు కేజే శ్రీనివాసులు, ప్రసాద్, కృష్ణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సోలార్ అవసరాల కోసం ప్రభుత్వం భూములు కేటాయించడం వల్ల పశుపోషణకు ఇబ్బందులు ఎదురవుతాయని అనేకమార్లు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేశామన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు కంపెనీ నిర్వాహకులతో చర్చించి 60 ఎకరాలు కేటాయించేలా కృషి చేశారన్నారు. పశువుల రాకపోకలకు ఏలాంటి ఆటంకాలు లేకుండా ప్రజా అవసరాలు దృష్టిలో ఉంచుకొని భూమి కొలతలు వేయించి కేటాయించారన్నారు. అలాగే 212 సర్వే నెంబరులోని ప్రభుత్వ భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చేలా కృషి చేయాలని కోరారు. తహసీల్దారు, సీఐలకు కృతజ్ఞతలు తెలిపారు.


అధికారులతో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఉచిత శిక్షణను వినియోగించుకోండి

ఆత్మకూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. డిగ్రీ లేదా బీటెక్‌లో కంప్యూటర్ చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 7673902328 సంప్రదించాలన్నారు.

బీపీఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి

నందికొట్కూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు బిల్డింగ్ పీనలైజేషన్(బీపీఎస్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ బేబి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన భవన నిర్మాణ క్రమబద్ధీకరణ పథకంలో భాగంగా బీపీఎస్ మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. పట్టణంలో అనుమతులు పొందని భవనాలకు, భవన నిర్మాణ అనుమతికి విరుద్ధంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. 2026-3- 11తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

నేడు బ్రహ్మనందీశ్వరాలయంలో కార్తీక పూజలు

నంద్యాల కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల వీరశైవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నంద్యాల కోట వీధిలో వెలసిన బ్రహ్మనందీశ్వరాలయంలో కార్తీక ధాత్రీ సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వీరశైవ సంక్షేమ సంఘం నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం సంఘం సమావేశం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సామూహిక కార్తీకభోజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరశైవుల అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఎమ్మెల్యేకు అభినందనలు


ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందిస్తున్న నాయకులు

వెలుగోడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఐటీడీపీ సభ్యులు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం వేల్పనూరులో ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి సన్మానించారు. ఇటీవల ఎమ్మెల్యే సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొంథా తుఫాన్ వారియర్ అవార్డు ఇవ్వడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో హుస్సేన్, మజీద్, సభ్యులు ఉన్నారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలి

పాములపాడు, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిల్లలు ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి ఈ నెల 26 వరకు నిర్వహించనున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులలో 5 నుంచి 15 ఏళ్ల మధ్య వయసులో ఉన్న పిల్లల కార్డులను అప్డేట్ చేసుకోవాలన్నారు. పిల్లల ఆధార్ అప్డేట్ లేకపోతే పలు ప్రభుత్వాలు వర్తించక ఇబ్బందులు పడుతారన్నారు. ఈ బయోమెట్రిక్ పూర్తిగా ఉచితమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఎంపీ నిధులతో బోరు ఏర్పాటు

నందికొట్కూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎంపీ నిధులతో భక్తుల సౌకర్యార్థం జమ్మిచెట్టు (శమి)వద్ద కొత్తగా పవర్ బోరు పనులు శనివారం ప్రారంభించారు. గతంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఇచ్చిన మాట ప్రకారం రూ.2.70 లక్షలు నిధులు మంజూరు చేశారని ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటేష్, శేఖర్ తెలిపారు. సమితి సభ్యులు ఎంపీ, మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీటెక్ రాజు, శ్రీధర్, వెంకటేష్, శేఖర్, భాను ప్రకాష్, నాగరాజు, రేవంత్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో ఉర్దూ పాఠశాల

మిడుతూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడుమూరు మండల పరిషత్ ప్రాథమిక ఉర్దూ పాఠశాల అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మద్దిస్వామి అన్నారు. శనివారం పాఠశాలను పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పరిశీలించారు. స్థానిక సమస్యలపై విద్యాశాఖ అధికారులు స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నాయకులు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

నందికొట్కూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న, ఉల్లి, పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ నాయకుడు పుల్యాల నాగిరెడ్డి డిమాండ్ చేశారు. వైసీపీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. శనివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో రిలే నిరాహారదీక్షల పోస్టర్‌ను ఆవిష్కరించారు. రైతులను మోసగిస్తున్న ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకించాలన్నారు. సమావేశంలో వైసీపీ పట్టణాధ్యక్షులు మన్సూర్ అహ్మద్, రమేష్‌నాయుడు, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రారెడ్డి పాల్గొన్నారు.

దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలి

బండిఆత్మకూరు నవంబరు15(ఆంధ్రజ్యోతి): పాలక మండలి సభ్యులు దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని గ్రూప్‌దేవాలయాల ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈవో ఆకృతి నాగప్రసాద్ సూచించారు. శనివారం సాయంత్రం చైర్మన్‌గా మద్దిగారి పుష్పరాజు, సభ్యులుగా వెంకటేశ్వర్లు, లక్ష్మిదేవి, లక్ష్మి, పార్వతమ్మ, నాగేశ్వరమ్మ, చంద్రకళ, సదాశివరావు, భవాని, వెంకటేశ్వర్లు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భూపాల్, బలరాముడు, శివయ్య పాల్గొన్నారు.

అడవి జంతువు వేట కేసులో ముగ్గురి అరెస్టు

నంద్యాల ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు సమీపంలో అడవి పందిని వేటాడిన కేసులో ముగ్గురిని అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. నంద్యాల డీఎఫ్‌వో కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎఫ్ఆర్‌వో షేక్ నజీర్ జా వివరాలు వెల్లడించారు. ఈర్నపాడు సమీపంలోని కేసీ కెనాల్ వద్ద అడవి పందిని వేటాడుతున్న కల్లూరు వెంకటరమణ, కల్లూరి శ్రీనివాసులు, కలడిఈశ్వరయ్యలను అరెస్ట్ చేశామన్నారు. వన్యప్రాణులను వేటాడినా, వాటి మాంసం కొన్నా, అమ్మినా నేరమన్నారు. వన్యప్రాణులను వేటాడిన వారి సమాచారాన్ని ఇస్తే తగిన పారితోషకం ఇచ్చి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో ఎఫ్ఎస్‌వోలు రామకృష్ణ, నాగేంద్రయ్య, ఎఫ్‌బీవో పరమేశ్వరీ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే ప్రపంచ విజ్ఞానం

నంద్యాల కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పుస్తకపఠనం అనేది చాలా మంచి అలవాటు అని, ప్రపంచంలో అత్యున్నత విజయం సాధించిన ఎందరో మేధావులు పుస్తక ప్రియులేనని నంద్యాల ఎంఈవో శివరామ ప్రసాద్ అన్నారు. శనివారం నంద్యాల పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయంలో ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి శ్రీధర్ అధ్యక్షతన పుస్తకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సుబ్బారావు, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, తులసీనాథ్, ప్రదీప్‌కుమార్ రెడ్డి, సురేష్‌కుమార్, నవీన్, పుస్తకపాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: పుస్తకాలు చదవటం వల్ల జ్ఞానోదయం కలుగుతుందని గ్రంథాలయ అధికారి రవిరాజ్ అన్నారు. శనివారం బండిఆత్మకూరు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు.

పాములపాడు: మండలకేంద్రంలోని గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పుస్తక ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కృష్ణారెడ్డి, పుస్తక పాఠకులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి తిరుణాల

● పూజల్లో పాల్గొన్న పలువురు ప్రముఖులు


పూజల్లో పాల్గొన్న బీసీ ఇందిరమ్మ, మూలె రామేశ్వర రెడ్డి

కొలిమిగుండ్ల, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కోరుమాన్‌పల్లె సమీపంలో వెలిసిన ప్రసిద్ధ గుండం ఆంజనేయస్వామి తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం చివరి శనివారం పురస్కరించుకొని ఆంజనేయస్వామికి ప్రీతికరమైన ఆకుపూజ, పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటుచేశారు. బీసీ ఇందిరమ్మ, టీడీపీ మండలాధ్యక్షుడు మూలె రామేశ్వరరెడ్డి, కొలిమిగుండ్ల సొసైటీ చైర్మన్ అంబటి వివేకానంద రెడ్డి తిరునాళ్లలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. కార్యక్రమంలో కోరుమాన్‌పల్లె గ్రామ పెద్దలు నరసింహా రెడ్డి, ఓబయ్య, నారాయణ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, తోళ్లమడుగు సర్పంచ్ ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

చాగలమర్రి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వెల్లాల క్షేత్రంలోని చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాల అభివృద్ధికి దాతలు రూ.లక్ష విరాళం త్రవ కమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డికి శనివారం అందజేశారు. బ్రాహ్మణపల్లెకు చెందిన రామకృష్ణారెడ్డి రూ.20,016, టంగుటూరుకు చెందిన వెంకట్రామిరెడ్డి రూ.25,116, ప్రొద్దుటూరుకు చెందిన సుబ్బరాయుడు రూ.20,116, షణ్ముఖం రూ.20,116, ఆంజనేయులు రూ.20,116, విరాళంగా అందజేశారు. దాతలను కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకులు శాలువా, పూలమాలలతో సన్మానించి అభినందించారు. కమిటీ సభ్యులు సుబ్బిరెడ్డి, నరసింహారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో గ్రేడింగ్ పెంచాలి

చాగలమర్రి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల గ్రేడింగ్ పెంచాలని ఎంఈవో న్యామతుల్ల అన్నారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని బుగ్గవీధిలోగల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనాన్ని, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రేన్‌ను ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కొలిమిగుండ్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడుకి చెందిన మాదిగ ఓబులేశు అనే వ్యక్తిని క్రేన్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. శనివారం ఓబులేశు పని నిమిత్తం పేరుసోముల గ్రామానికి వెళ్లి తిరిగి నడుచుకుంటూ వస్తుండగా వెనుక వైపు నుంచి క్రేన్ వాహనం ఢీకొట్టింది. టీడీపీ కార్యకర్త అయిన ఓబులేశును గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కల్లూరి నూరి పరామర్శించి, 108 వాహనంలో నంద్యాలకు తరలించినట్లు టీడీపీ మండల ప్రచార కార్యదర్శి శివరామిరెడ్డి వెల్లడించారు.

సహస్ర లింగార్చన

రుద్రవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాసాపునంలో శనివారం కార్తీకమాసంలోని ఏకాదశి పర్వదినాన సహస్ర లింగార్చన, అభిషేకం నిర్వహించారు. 1128 శివలింగాలు పుట్టమట్టితో తయారు చేసి భారీ శివలింగం ఏర్పాటుచేశారు. పుట్టమట్టితో సహస్ర లింగం ఏర్పాటుచేశారు. శ్రీచక్రం రూపంలో అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. ఈ లింగాలకు పూజిస్తే పాపాలు తొలగి పోతాయని అర్చకులు వారణాసి గోపిశర్మ , శివశర్మ అన్నారు. చైర్మన్ మధుసూదనరెడ్డి, వైస్ చైర్మన్ రంగనాయకులు, కార్యదర్శి కాణాల నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ఏకాదశి పూజలు

ఉయ్యాలవాడ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.జంబులదిన్నె మెట్టవద్ద వెలసిన అభయ ఆంజనేయస్వామికి శనివారం కార్తీక బహుళ ఏకాదశి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అర్చకుడు కీర్తి లక్ష్మణస్వామి స్వామివారికి అభిసేకం చేసి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి పంచామృతాభిసేకం, కుంకుమార్చన, ఆకుపూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు పరుగు పందెం పోటీలు

సంజామల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గిద్దలూరు పుస్తక నిక్షిప్త కేంద్రంలో విద్యార్థులకు శనివారం పరుగుపందెం పోటీలను ఏర్పాటు చేశారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విజేతలకు ఈ నెల 20న బహుమతి ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు మద్దిలేటి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజన్న, ఇబ్రహీం, పుల్లమ్మ, ఓబయ్య దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ


ఆర్ఎస్ రంగాపురం పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

బేతంచెర్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. శనివారం ఆయన ఆర్ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ గది, ల్యాబ్‌లను పరిశీలించారు. హెచ్.కొట్టాలలో సంచార వాహనం ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు. వైద్యులకు సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పురుషోత్తంరెడ్డి, సీహెచ్‌వో జయసుధ, హెల్త్ అసిస్టెంట్ నిర్మలదేవి, సురేష్‌కుమార్, సర్వేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి నైనాలప్ప ఉత్సవాలు

సంజామల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కడప, నంద్యాల జిల్లాల సరిహద్దు ప్రాంతం అయిన అక్కంపల్లె కొండల్లో వెలిసిన నైనాలప్ప క్షేత్రంలో ఆదివారం నుంచి తిరుణాల ప్రారంభం కానున్నాయి. ఓంకారేశ్వరుడి క్షేత్రంలో కార్తీకమాసం ప్రారంభం నుంచి ప్రత్యేక పూజలు వైభవంగా సాగుతున్నాయి. జిల్లాలోని శ్రీశైలం, మహానంది, యాగంటి తరువాత స్థానంలో నైనాలప్ప క్షేత్రంలో ఓంకారేశ్వరుడు కొలువై ఉన్నాడు. తిరుణాల సందర్భంగా స్వామి వారి సన్నిధికి కడప, కర్నూలు జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. ఈ నెల 17న స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహిస్తారు. ధ్వజారోహణం, కలశస్థాపన, రుద్రాభిషేకం, స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. కోలాటలు, హరిభజన, హరికథ, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. క్షేత్రాన్ని చేరుకునేందుకు కోవెలకుంట్ల, జమ్మలముడుగు డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పించినట్లు ఈవో చంద్రుడు తెలిపారు. ఓంకార అన్నదాన సత్రంలో భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని కమిటీ వారు ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

నైనాలప్ప జాతర సందర్భంగా ఒంగోలు జాతిఎద్దుల రాష్ట్రస్థాయి రాతి దూలం పోటీలను ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఆదివారం నుంచే న్యూ క్యాటగిరి 6 పళ్ల విభాగంలో బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం వరకు పోటీలు కొనసాగుతాయి.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచండి

● డీఈవో జనార్దన్‌రెడ్డి


రుద్రవరం: ముకుందాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

రుద్రవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయిన పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని డీఈవో జనార్దన్‌రెడ్డి న్నారు. శనివారం మండలంలోని ముకుందాపురం పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలపై చర్చించారు. ఈ పాఠశాల 8వతరగతి నుంచి 10వతరగతి వరకు అప్‌గ్రేడ్ అయింది. ముకుందాపురం పాఠశాలలో 1నుంచి 9 వరకు 121 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో డెస్కులు, రన్నింగ్ వాటర్ తప్పక ఉండాలని సూచించారు. పాఠశాలకు స్థలం పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 లక్ష్మి, హెచ్‌ఎంలు భార్గవరామయ్య, గురప్ప తదితరులు ఉన్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు

ఆళ్లగడ్డ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో జరిగే క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. శనివారం అహోబిలంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో బాలికల రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు సిద్ధం చేస్తున్న క్రీడామైదానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈనెల 27 నుంచి 29 వరకు బాలికల రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీలకు సంబంధించిన మైదానం, విడిది గృహాల సౌకర్యాలు, తాగునీరు, పారిశుధ్యం, భద్రతపై పర్యవేక్షిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు రానున్నారని తెలిపారు. బేస్ బాల్ టోర్నమెంట్ ఆర్గనైజర్ నాగేంద్ర, జిల్లా ఎస్‌జీఫ్ కార్యదర్శి విశ్వనాథ్, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రసన్నకుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత ఏపీగా తీర్చిదిద్దాలి

\- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి

బేతంచెర్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత ఏపీగా తీర్చిదిద్దాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు సమాజ పరిశుభ్రత ప్రాముఖ్యంపై అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజా భాగస్వామ్యంతో పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వార్డు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు. ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు కేటాయిస్తామన్నారు. పీఎంఏవై ద్వారా నూతన గృహాల మంజూరు పత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి : డీపీవో లలితాబాయి


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డీపీవో లలితాబాయి

శిరివెళ్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి లలితాబాయి అన్నారు. శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' భాగంగా కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చేతుల పరిశుభ్రతపై విద్యార్థినులకు ఆమె అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములై స్వచ్ఛతను నెలకొల్పాలని డీపీవో పిలుపినిచ్చారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, ఎంఈవో- 2 నాగార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశ్విన్‌కుమార్, కేజీబీవీ ఎస్‌వో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

కోవెలకుంట్ల: అందరి సహకారంతోనే మేజరు గ్రామ పంచాయతీ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎంపీడీవో వరప్రసాదరావు అన్నారు. పట్టణంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి కలిసి నిర్వహించారు. అధికారులు, విద్యార్థులు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో చెత్త చెదారాన్ని తొలగించి ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశ్‌నాయుడు, ఎంఈవో వెం కటసుబ్బయ్య, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు. శ్రీవాసవి బొ మ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ఆధ్వ ర్యంలో ఈకార్యక్రమం చేపట్టారు.

పారిశుధ్యంపై అవగాహన

ఆళ్లగడ్డ: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మండల ప్రత్యేక అధికారి హరిగోపాల్ అన్నారు. శనివారం మండలంలోని ఓబులంపల్లెలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జడ్పీహెచ్‌ఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపీడీవో నూర్జహాన్, ఎంఈవో శోభావివేకవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో కమిషనర్ కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సిబ్బందితో కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు.

పరిసరాల పరిశుభ్రత..

చాగలమర్రి: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీవో తాహిర్‌హుసేన్ తెలిపారు. చాగలమ్మ చెంచుకాలనీలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' నిర్వహించారు. స్వచ్ఛతపై అధికారులు, సచి వాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ వర్కర్లు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. మం డల ప్రత్యేకాధికారి జగ్గయ్య, ఏవో రాజేంద్రప్రసాద్, ఏఈ కొండారెడ్డి, ఏపీఎం నాగమ్మ, సూపర్‌వైజర్ సుశీల, ఈవో తారకేశ్వరి, పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం..

కొలిమిగుండ్ల: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల శుభ్రత పాటిస్తే సమాజంలో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో దస్తగిరిబాబు అన్నారు. మండలంలోని కల్వటాలలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి, వీఆర్వో ప్రసాదరెడ్డి, పాల్గొన్నారు.

..అందరి బాధ్యత

దొర్నిపాడు: గ్రామాల్లో స్వచ్ఛత అందరి బాధ్యత అని ఎంపీడీవో సావిత్రి, ఈవోపీఆర్డీ శివప్రసాద్ అన్నారు. అమ్మిరెడ్డినగర్‌లో కేజీబీవీ విద్యార్థినులు పురవీధుల గుండా ర్యాలీ చేపట్టారు. చేతుల శుభ్రతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

ఉయ్యాలవాడ: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

రుద్రవరం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం, ఆరోగ్యం కాపాడుకుందామని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో ర్యాలీ చేపట్టి ప్రతిజ్ఞచేశారు. డిప్యూటీ ఎంపీడీవో సుబ్రమణ్యం, ఉపాధి, వెలుగు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


కోవెలకుంట్లలో..


దొర్నిపాడు: అమ్మిరెడ్డినగర్‌లో..


కొలిమిగుండ్లలో..

స్వామిత్వ సర్వేపై అభ్యంతరాలు తెలపండి

కొలిమిగుండ్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేపై అభ్యంతరాలుంటే అధికారుల దృష్టికి తీసుకరావాలని ఎంపీడీవో దస్తగిరిబాబు అన్నారు. శనివారం మండలంలోని బి.ఉప్పలూరు లో స్వామిత్వ సర్వేపై అవగాహన నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

స్వామిత్వతో గృహ హక్కు పత్రం

ప్యాపిలి : స్వామిత్రతో గృహ హక్కు పత్రం అందించినట్లు డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. శనివారం మండలంలోని మునిమడుగు సచివాలయంలో స్వామిత్ర కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పత్రం ద్వారా ప్రైవేటు, ప్రభుత్వ గృహాలకు పూర్తి హక్కులు వస్తాయన్నారు. సర్పంచు హరికుమార్, కార్యదర్శి శ్రీకాంత్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. జ్ఞాన భాండాగారాలు


దొర్నిపాడు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

దొర్నిపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలని గ్రంథాలయ అధికారి అఖిలబేగం అన్నారు. శనివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విద్యార్థులకు అవసరమైన మంచి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి విద్యార్థి, యువకులు వాటిని చదివి మేధస్సును పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

గ్రంథాలయాల్లో విలువైన పుస్తకాలు ..


కొలిమిగుండ్లలో..

కొలిమిగుండ్ల: ప్రభుత్వం గ్రంథాలయాల్లో ఎంతో విలువైన పుస్తకాలను అందుబాటులో ఉంచిందని గ్రంథాలయ అధికారి రాజా మనోహర్ అన్నారు. పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున రెడ్డి, రమేష్ శెట్టి, నవీన్, పలువురు పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలు అని గ్రంథాలయ అధికారి సంగీతలక్ష్మి తెలిపారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ఈ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు రంగయ్య ఉన్నారు.

పలుకూరుకు విద్యార్థి బస్సు నడపాలి

బనగాన పల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పలుకూరుకు విద్యార్థి బస్సు నడపాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు శనివారం బనగానపల్లె ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. పలుకూరు నుంచి బనగానపల్లెకు వచ్చేందుకు విద్యార్థి బస్సులేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చందు, రాజేశ్, సంతోష్, నవీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

చాగలమర్రి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆరోపించారు. శనివారం చాగలమర్రిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజావ్యతిరేక విధానాలను తెలియజేశారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడంతో పేదల విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందన్నారు. వైసీపీ నాయకులు బాబులాల్, షబ్బీర్, కుమార్‌రెడ్డి, ముల్లా రఫీ, పెయింటర్ రఫీ పాల్గొన్నారు.


నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఐదు వేల ఉద్యోగాలే లక్ష్యం

● ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఐదు వేల ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చడమే లక్ష్యమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం స్థానిక కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. 231 మంది యువతీ, యువకులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా 134 మంది సెలెక్ట్ అయ్యారు. వీరికి ఎమ్మెల్యే అఖిలప్రియ అపాయింట్‌మెంట్ లెటర్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ జాబ్‌మేళాలో ఎంపికైన ప్రతిఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరెన్నో ఉద్యోగాలు ఇప్పించి నిరుద్యోగ యువతను ఆదుకుంటామన్నారు. కేసీ సుబ్బారెడ్డి అధ్యాపకులు, నిరుద్యోగులు, వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం

చాగలమర్రి: స్థానిక ముత్యాలపాడు బస్టాండు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన విక్టరి కల్యాణ మండపాన్ని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శనివారం ప్రారంభోత్సవం చేశారు. కల్యాణ మండపంలో వేద పండితుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా సాగింది. ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఆమెకు ఆశీర్వదించారు. మండల కన్వీనర్ నరసింహారెడ్డి, టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మౌలాలి, మైనార్టీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి మాబుషరీఫ్, అనిఫ్, సింగిల్‌విండో అధ్యక్షుడు ఉసేన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, గుర్విరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగు లాభదాయకం


ఆయిల్‌పాం పంటను పరిశీలిస్తున్న హెచ్‌వో దస్తగిరి

చాగలమర్రి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అయిల్‌పాం సాగు రైతులకు లాభదాయకమని ఆళ్లగడ్డ ఉద్యానశాఖ అధికారి(హెచ్‌వో) దస్తగిరి తెలిపారు. మండలంలోని ముత్యాలపాడు, కలుగొట్లపల్లె, చింతలచెరువు, చిన్నవంగలి, పెద్దవంగలి, శెట్టివీడు గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పాం తోటలను ఆయన పరిశీలించారు. అంతర్ పంటల సాగుపై అవగాహన కల్పించారు. గత ఏడాది 31 హెక్టార్లు, ఈ ఏడాది 32 హెక్టార్లలో ఆయిల్ పాం సాగు చేశారన్నారు. ఎకరాకు రూ.4,200 ఉచితంగా అందజేస్తారన్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో 160 హెక్టార్లలో, 298 మంది రైతులకు పంట నష్టం జరిగిందన్నారు. ఆయన వెంట కో-ఆర్డినేటర్ వెంకట్ రెడ్డి, కాశీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక ఏకాదశి దీపోత్సవం


కోదండ రామాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చాగలమర్రి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయం, రామలింగేశ్వర, భీమలింగేశ్వర, బుగ్గమల్లేశ్వర ఆలయాల్లో శనివారం కార్తీక ఏకాదశి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కోదండ రామాలయంలో 108 దీపాలు వెలిగించి దీపోత్సవ కార్యక్రమం చేపట్టారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్లు ధరించాలి

కోవెలకుంట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బైకు నడిపే వాహనదారులు హెల్మెట్లు ధరించాలని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. శని వారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించని వారికి, లైసెన్సులు లేని వారికి జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు తప్పక లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సుర క్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్‌ఐ తెలిపారు. పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు పెంచాలి


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారులు

ప్యాపిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం సాగు పెంచాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు శ్రీనివాసులు సూచించారు. శనివారం మండలంలోని గార్లదిన్నె గ్రామంలో రబీలో ప్రకృతి వ్యవసాయం సాగుపై తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఏడాది పొడవున పొలంలో సూర్యరశ్మి సోకకుండా ఏదోక పంట సాగు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన దిగుబడులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారులు అబ్దుల్ సలాం, భీమేష్, చిన్నపుల్లయ్య, నీలకంఠేశ్వర్, రంగడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవతోనే సంతృప్తి : గౌతమ్‌కుమార్ రెడ్డి

డోన్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవతోనే సంతృప్తి లభిస్తుందని టీడీపీ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం గౌతమ్ కుమార్ రెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలోని పాత బస్టాండులో ఎంఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎంఎస్ఆర్ కార్యాలయంలో గౌతమ్‌కుమార్ రెడ్డిని నియోజకవర్గంలో పలువురు గ్రామస్థులు, నాయకులు, కార్యకర్తలు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంఎస్ఆర్ కార్యాలయంలో కేక్ కటింగ్‌చేసి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఎర్రిస్వామి గౌడు, చనుగొండ్ల కాశీ, సెటిల్మెంట్ శెట్టి, బీఎడ్ భాషా, నీలం ప్రభాకర్, బబ్లూ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం : ఆర్టీవో



మాట్లాడుతున్న ఆర్టీవో క్రాంతికుమార్, సూచనలు వింటున్న ప్రయాణికులు

డోన్ రూరల్, నవంబరు (ఆంధ్రజ్యోతి): కొన్ని ట్రావెల్ బస్సులు ఎటువంటి ఫిట్‌నెస్ లేకుండా రోడ్డుపై తిరుగుతున్నాయని, ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని ఆర్టీవో క్రాంతికుమార్ అన్నారు. శనివారం హైదరాబాదు నుంచి యాగంటి క్షేత్రానికి ఆదివారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని వెళ్తున్న ప్రయాణికుల మినీ బస్సును ఆయన తనిఖీ చేశారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.